కొందరలోనే నేను ఏదో పనిమీద వెళ్తూ వాడి ఊళ్లో ఆగాను. వాడు పూర్వం కన్నా దుక్కలాగున్నాడు. నన్నుచూసి వెధవ నవ్వొకటి నవ్వి.

"నా పెళ్ళి గురించి వినే ఉంటావు" అన్నాడు ప్రపంచంలో అదొక్కటే ముఖ్యమైన వార్తలాగ.

"ఆఁ" అన్నాను క్లుప్తంగా.

"ఏం చెయ్యమంటావు చెప్పు. నాకేమో ఇంకో జన్మకి ఎవర్ని పెళ్ళాడ్డ ఇష్టంలేదు. రాధని మర్చిపోవడం సాధ్యంకాదు (అసలొకప్పుడా జ్ఞాపకం ఉంటా) అసలు నా మట్టుకు నాకు భార్య అవసరం లేదు. నాకు జీవితంమీద విరక్తి వచ్చేసింది. కాని ఈ పిల్లల్ని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందిగా ఏలాగైనా తీర్చొచ్చు కాని తల్లిలేనిలోటు తీర్చలేం. నాకోసం కాకపోయినా వీళ్ళ కోసమైనా తప్పదు మరి. అందుకే ఒప్పుకోవాల్సొచ్చింది" అన్నాడు వేదాంతి మొహంపెట్టి.

ఇంతకాలం సహించిన నేను ఇంక ఊరుకోలేక పోయాను. నాకు పరమ అసహ్యం వేసింది వాడంటే వెంటనే.

"ఇంతవరకూ నువ్వు యీ చప్పు పేలాపన సాగించి ఏడుస్తూ బతుకు ఎంతకాలమని యిలా అసంకల్పంగా వాగుతావు. ఈ వాగుడులోనే రాధనలా హింసలుపెట్టి ఆమెకి చిన్నయెత్తు సుఖం లేకుండా చేశావు. ఆమె పోయాకకూడా నీకు బుద్ధి రాలేదు. అటువంటప్పుడు మళ్లీ ఎందుకు మరో ఆడదాన్ని బాధ పెడతావు ఇప్పటికైనా నీ ఆత్మవంచన మానేసి ఉన్నది ఉన్నట్లు మాట్లాడు. నువ్వు యిప్పుడు మళ్ళ పెళ్ళి చేసుకుంటోంది ఊరివాళ్ళ కోసంకాదు. నీ పిల్లలకి తల్లిలేదనీ కాదు. అసలుసంగతి చెపుతావిను, నీకు ఆడదాని సుఖం కావాలి అంచేత ఆడివ్వడానికి మరో భార్య కావాలి ఆ సంగతి ధైర్యంగా ఒప్పుకో. అంతేకాని యిలా జీవితాంతం నిన్ను నువ్వు వంచించుకోకు." అని గబ గబా అనేసి వచ్చేశాను.

వాడు నా మాటలువిని వెర్రివాడివి చూసినట్లు చూశాడు లాభంలేదు నా నోరు నొప్పేకాని వాడికి ఏమిచెప్పినా నెత్తికెక్కదు. అటువంటి వాళ్ళంతే వాళ్ళు అలా జీవితాంతం ఆత్మద్రోహం చేసుకుంటూనే ఉంటారు. అటువంటి వాళ్ళున్నంతకాలం ఈ ప్రపంచం బాగు పడదు. వాళ్ళు లేకుండాపోవడం అన్నది అసంభవం. అది మన ఖర్మ అంతే.

